# (మూ)నవగాథ

అసలు, నేనీకథ రాయకనేపోదును; రాయవల్సిన అవసరమేలేదు. నేనేకాదు-ప్రపంచంలోని ఏకథాకారుడూ - చివరికి విశ్వం కథకుల్లోని మేటివాడైనా, అత్యల్పుడైనా, ఈ కథను రాయాల్సిన పనేలేదు.

ఈ కథ చెప్పడానికి లోకంలో వున్న భాషలపదాల శక్తిచాలదు-చివరికి మౌన భాషక్కూడా! కథావస్తువు అంత గంభీరమైనది; అనంతమైంది. దీనికి ఏ మహోన్నతమైన టెక్నిక్కూ పనికిరాదు; అసలు పుట్టుకతోనే నాకు టెక్కులన్నా, వెక్కులన్నా, అసహ్యం; అలాంటిది టెక్నిక్‌ల జోలికెందుకు పోతాను.

ఇక శిల్పమంటారా? ప్రకృతిలో సహజ శిల్ప సంపదలేని అత్యల్ప వస్తువేది వుంది? ప్రతీదాన్నీ ఆ అజ్ఞాత శిల్పి, అప్రతిహత ప్రతిభాశాలి, అద్వితీయ మేధావంతుడు, అనాకారుడు, వుండికూడా లేనివాడూ, లేక వున్నవాడూ, వాడే, అతగాడు, మీలో కొందరు 'భగవంతుడనీ', 'అల్లా' అనీ, 'గాడ్' అనీ నమ్మి, పిలుస్తోవుంటారుగా, వాడు సమస్త చరాచరాలన్నీ సహజ శిల్ప సౌందర్యంతోనే సృష్టిస్తాడనిగా మీ వుద్దేశం. అలాంటప్పుడు, ఆ సృష్టిలో కొందరు పున:సృష్టి చేసేటప్పుడు ఆమాత్రం శిల్పాన్ని ప్రవేశపెట్టడూ? అసలు శిల్పంలో ఏముంది గొప్పతనం! శిల్పాన్ని అర్థంచేసుకుని, ఆనందించే రసజ్ఞుల్లో వుందిగాని. ఆనందించేవారు రసజ్ఞులైనప్పుడు, ప్రతీదాంట్లోనూ శిల్ప సౌందర్యాన్ని పిపాసా వీక్షణాల్తో చూసి తెల్సుకుంటోనే వుంటారు.

ఎందుకూ, అలా పొట్ట చేత్తోపట్టుకుని, నోరు పెద్దగా జాపి ముందుకూ, వెనక్కూ ఊగుతున్నారో? మరి కొందరెందుకూ అలా తీక్షణంగా చూస్తూ నోటి పెదవుల్నీ, నాలికల్నీ గబగబా కదుపుతున్నారు-మూవీచిత్రాల్లా?

ఓహో అదా? నాకు తెలుస్తోంది, లెండి. 'మరి, ఈ కథ నెందుకు రాస్తున్నావు?' అనా మీ చర్యల తాత్పర్యం? అది స్పష్టంగా యాడవకూడదూ, అలా విపరీతాలకు పోకపోతే. ఊ! దానికే వొస్తున్నాను. ఈ కథ ప్రతీవానికీ, ప్రతి ఖశ్చన్నకీ వొచ్చి చెప్పలేనుగా, అందుకే

రాస్తున్నది. ఆమాత్రం గ్రహించలేరూ? భగవంతుడు, మీకు బుర్రలు పెట్టలేదూ? ఆ తలకాయలు కాదోయ్ పెద్దన్నయ్యలూ, దానిలోపలి గుజ్జు. అదుంటేనే వుంది రంజు అంతా. ఎందుకు రాస్తున్నానంటే ఈ రెండువందల కోట్ల మానవాళిలోనూ, లెక్కకు మించిన ఇతర ఖగోళాల జనాభాలోనూ, ఏ ఒక్కడైనా హృదయమున్నవాడు లేకపోతాడా? అని. ఎందుకూ అలా గుండెల్ని పరీక్షించుకుంటున్నారు?

మీ గుండె వుందో, ఆగిందో, అనా? మరేం భయపడకండి, భయ్యాలంతా. మీ గుండెలకే రోగమూ రాలేదు. హృదయమంటే ఊపిరితిత్తుల ద్వారా ప్రాణవాయువుని గ్రహించి రక్తాన్ని పరిశుభ్రపర్చే ఆ యంత్రం లేదర్రా? మహాశయులారా! హృదయమంటే హృదయమే! దాని అర్థాన్ని ఏ నిఘంటువూ ఇవ్వలేదు - వాటికి ఇచ్చే శక్తిలేదు-ఎందుకంటే వాటిని సమకూర్చినవాళ్ళకే అది లోపించవచ్చు. హృదయమంటే-ఆ ఆకారంలేని మనస్సుకి వెనకాల అగాధంలో, నిరాకారమైన-అదేదో-స్పందనము కలిగించేది. మీరు చూసినదాన్ని, విన్నదాన్నీ గురించి మనసు కరిగించిన భావాల నర్థంచేసుకుని ప్రకంపనం పొందే-అది. ఏ శాస్త్రకారుడూ దాని ఉనికిని కనుక్కోలేడు. ఐనా ఏ శాస్త్రకారుడూ దీని అస్థిత్వాన్ని కాదనలేడు-

ఆ హృదయమున్నవాడు, దీన్ని తన భాషలోకి అనువదించుకుని, చదివి, అర్థం చేసుకోలేక పోతాడా? అర్థం చేసుకుని ప్రకంపింపక పోతాడా? అని నా ధైర్యం.

ఆ. పోతాడు. తప్పకుండా ప్రతీవాడూ పొయ్యేవాడే. కాని కొద్ది సమయభేదం వుంటుందంతే! నేను చెప్పేదీ, అదే నేనూ పోతున్నాను, పోబోతున్నాను. అప్పుడే ఏభై సంవత్సరాలు పోయాను. ఇంకో పదేళ్ళు, ఇరవై ఏళ్లు, ముప్పై ఏళ్లు పోతాను, పోయి తీరుతాను. భయపడకండి బ్రదర్స్, బాధపడిపడకండి. మీరూ వొస్తారు. ఆరోజు నేనూ చూస్తాను, కాలంలో కళ్ళని పెట్టుకుని-కళ్ళల్లో వెలుగుని పెట్టుకుని-మీ పొయ్యేకాలం చూడకపోతానా? అది చూడడాన్ని ఎదురుచూడకపోతానా? అప్పుడు మీ వికవికలూ, పకపకలూ, అక్కడికి మీ కొక్కరికే పళ్ళున్నట్టు, నవ్వడం చేతైనట్టు, అవన్నీ అర్థరహితాలని తెల్సుకుని. మీ చేతలకి మీరే ఏడ్వడం, కన్నీళ్ళులేని దొంగ ఏడుపులు అనే వుడుపుల్ని తొలగించుకొని, ఉడుకువెూతుతనపు ఉడుకున్ని తలదన్ని, నిజమైన ఏడ్పు హృదయస్పందనంతో కూడిన అనిర్వచనీయమైన విచారాన్ని ప్రకటించడం నేను చూడకపోతానా, సోదరులారా, చూడకపోతానా?

కాని ఏం ప్రయోజనం? అప్పటికి మీ ఎకసక్కాలవల్ల, వ్యంగ్య నటనలవల్ల, వెక్కిరింపుల వల్ల, వేళాకోళాలవల్ల, హేళనలవల్ల ఎన్నో హృదయాలు రంపపుకోతకి బలియై వుంటాయి. ఇతరులు- మీకంటే తెలివైనవాళ్ళు-మిమ్మల్ని అలాఏడిపించి వుంటారు. కాని ఆ యవ్వనపు మదంలో, కన్నుమిన్ను కానని తనంలో, అవన్నీ గుర్తుండవు. జీవిత చరమాధ్యాయాలలో కాలుపెట్టాక, జీవితంలో మీధ్యేయం గురించి ఒకసారి వెనక్కుచూసి, వెనక చూపుచూస్తో,

పాత జ్ఞాపకాల విజ్ఞాపనల్ని వింటే మీకేగోచరిస్తుంది-యథార్థం; అసలు నిజం; కటికనిజం; చేదునిజం; నిజమైననిజం; యిజాల లన్నిటినీ మించిన నిజం.

అదుగో, ఇంకా హేళనాస్వర సహిత వికటాట్టహాసం మీ ముఖాలమీద నుంచి పోలేదుగా! పుర్రెలో పుట్టినదానికి పుడకలతోనే అంతం అనేదానికి మీ మొహాలు సాక్ష్యాలా? పుడక లెందుకు పుణ్యాత్ముల్లారా? నేను సరిగా కళ్ళు విప్పిచూడనుగాని, చూస్తే నిలువునా భస్మంకారూ? నిటలాక్షుని నిటలాక్షి ఇంకా పటలం కాలేదుగా.

ఇంతకీ మిమ్మల్ననాల్సిన పనేమిటి? 'కర్మ' అంటే సరిపోతుందిగా. "కర్మ!' ఎంత గొప్పపదం! ది గ్రేటెస్ట్ డిస్కవరీ ఆన్ ది ఫేస్ ఆన్ ది ఎర్తు! భగవంతుడు మాత్రం! వాడి తస్సాదియ్యా! వాణ్ణి కనిపెట్టిన వాణ్ణి పధ్నాలుగు లోకాల్లో ఎక్కడున్నా పట్టుకొచ్చి, బలవంతంగా వందసార్లు "నోబెల్" బహుమానం ఇచ్చినా సరిపోదు. అబ్బ! ప్రపంచకంలో దేవుడు తరిగిపోని మూలధనం!! దేవుడి పేరుమీద సాగినంత వ్యాపారం, ఇతరులు చేసుకున్న "యాయవారం" నిజానికి అసలు దేవుడంటోవుంటే, వాడన్నా చేసుకోలేక పోవును-మనిషై పుడితే! ఆ "గాడ్" గాడిదే అసలు నేరమంతా-తనను డిస్కవర్ చేసేశక్తి సామర్థ్యాలుగల మనిషిని సృష్టించినందుకు.

డియర్ బ్రదర్స్! విసుక్కోకండి. మీ బాధల్ని వినేవారు లేరని మీరూ వాపొయ్యే రోజులొస్తాయి లెండి. అప్పుడు నన్ను పిలవనంపండి, సానుభూతి పూర్వకంగా వినకపోతే, నే చెప్పినవన్నీ తక్షణం మర్చిపోండి. ఆగ్యారంటీ నేనిస్తున్నాను. మీకేం పికర్ అక్కర్లేదు.

ఇంతఎందుకు చెబుతున్నానంటే, పెద్దన్నయ్యలూ, నేనూ ఇరవైఏళ్ళవరకూ మీలానే 'ఫ్రేబర్డ్' లా, అందరినీ అపహాస్యం చేస్తో, దరిహాస పరిహాసాలతో బతికేనన్రా! నేనూ గుడ్డివాళ్ళని తప్పుదారులు పట్టించి, ఆనందించాను; చెవిటివాళ్ళను మెల్లగా తిట్టి సంతోషించాను. రోగుల్ని అసహ్యించుకుని దూరంగాపోయి, వాళ్ల హృదయాలకు గాయంతగిలించాను. మూగవాళ్లను మూగభాషలతో ఏడిపించి నా మగతనం చాటుకున్నాను. అదంతా వెలిగించిన స్వానుభవాన్ని పురస్కరించుకునే మీకు ఈనాడు ఇంత సావకాశంగా, స్పష్టంగా చెప్పగలుగుతున్నాను, క్షమించండి వ్రాయగలుగుతున్నాను-ఐనా ఫరవాలేదులెండి వ్రాయడం చెప్పడానికి మారురూపమైన పనేగా.

సరిగ్గా ముప్పైఏళ్ళ క్రితం, అంటే నా ఇరవైయోఏట అన్నమాట. చదువు సంధ్యలు ముగించాక, జీవితంలో అడుగుపెట్టేదశ వచ్చింది. అంటే శిశుదశ (ఇన్‌ఫేన్సీ) గడిచిందన్నమాట. (మనిషి స్వార్జనాపరుడయ్యే వరకూ శిశుదశ అనే అనవచ్చుగా) సరిగ్గా అప్పుడు, అప్పుడే; యవ్వన ప్రాబల్యం అధికంగావున్న రోజుల్లో, లోకంలో ప్రతీదాన్నీ పరిహసించి, నిరసించే పొగరుమోతుతనం నాలో ప్రజ్వరిల్లుతున్న రోజుల్లో, లోకాన్ని లేదని, లోకంతో నాకేమిపని అని విర్రవీగే రోజుల్లో, నా నడుంమీద కర్రతోకొట్టినట్లుగా టైఫాయిడ్ వచ్చింది.

నలభైరోజులు బాధపడ్డాను. తిరిగి, తిరిగి కాంప్లికేషన్సు రావడంవల్ల మావాళ్ళంతా నా మీద నిరాశ చేసుకున్నారు. ఒకటి రెండుసార్లు మంచంమీంచి కిందికి దింపేశారు కూడా! నా మంచంకాళ్ళ క్రింద నేల ద్రవీకరించిపోయినట్టయింది. జీవితపు తొలిరోజుల్ని గురించి కనసాగిన కలలన్నీ కల్లలై దు:ఖసముద్రపు వెల్లువలో వెదజల్లబడి చెల్లాచెదరైపోయాయి. నేను తిరిగి మీలో పడతాననుకోలేదు.

చివరికి జ్వరం నయమై, పడ్డాను. పడ్డట్టే అగపడ్డాను. కాని చివరికి నాకు బాహ్యస్ఫురణ కలిగేటప్పటికి-ఏముంది? కళ్ళు తెరిచి చూశాను-తొలిసారిగా, నలభైరోజుల యమయాతన తర్వాత. అంతా నా బంధుబృందమంతా ఎదురుగా కనపడ్డారు. ఆ దృశ్యం నా కింకా కళ్ళకు కట్టినట్టుంది. 'అవుట్ ఆఫ్ ఫోకస్' అయిన చలనచిత్రాన్ని ప్రొజక్టు చేసేవాడు సరిచేసినట్ట నిపించింది. (ఆనాటినుండి నా జీవితమే ఓ సాధించరాని పెద్ద ప్రాజెక్టు అయింది.)

కాని వాళ్ళు ఏదో అనడానికి ప్రయత్నిస్తున్నట్టుగా పెదిమలు కదపసాగేరు. నీరసంవల్ల చెవులు దిబ్బదేసినట్టున్నాయి. నాకు మాటలు వినరాలేదు; ఇంకా గట్టిగా అరిచినట్టు వాళ్ళ చర్యలు నాకు అగపడసాగేయి. కాని నేనేమీ బదులు చెప్పలేదు. కారణం-అవి నాకు వినరాకపోవడమే.

కొంతసేపటికి నా శ్రవణేంద్రియాల సామర్థ్యంమీద నమ్మకం నాకేపోయింది. ఏకాగ్రతతో ఇతరులమాటలు వినడానికి, యత్నించాను. ఏదో 'ఝు'మ్మనే వింతధ్వనీ, ఖగోళాలధ్వని వంటి అవ్యక్తపుహోరుతప్ప మరేం వినరాలేదు. ఆనాటినుండి నేటివరకూ అదే నా చెవుల్లో రివ్వుమని మారుమ్రోగుతో వుంటుంది.

వాళ్ళంతా నిశ్చేష్టులై, రాతిబొమ్మల్లా నిలబడిపోయారు. నాకు నామీదే జాలికలిగింది. వాళ్ళమీద మరింత సానుభూతి! కాని ఏంచెయ్యను? పనిచేసే ఇంద్రియాలను నిగ్రహించవచ్చు గాని, పనిచెయ్యని ఇంద్రియాలపై ఆగ్రహించినా లాభమేమిటి? చాతకాని తనాన్ని కప్పి పెట్టుకునే మార్గం చేతనైనట్లు నటించడం చాతనే. అందుకని ఏదో మాట్లాడి వాళ్ళని సంతృప్తిపరచాలని యత్నించాలనే నిశ్చయానికివొచ్చా. 'మీగోల నాకు వినపడ్డంలేదురా!' అని మాట్లాడాలనే భావన కలగగానే, మెదడిచ్చిన ఆజ్ఞను శిరసా వహించడాని కన్నట్టు పెదిమలు ప్రయత్నించాయి - ఏదో; ఏమిటో? అవి ఏమన్నదీ వినడానికి నా చెవులు పనిచేయడం లేదుగా. అందుకని తెలీలేదు. అదీగాక పెదిమలుపలికే ప్రయత్నంలో చేసిన తిరుగుబాటువల్ల అనుకున్న భావం వ్యక్తపరుపబడలేదన్న సంశయం నాకే కలిగింది. దాన్ని చుట్టుపక్కలవున్న చుట్టపక్కాల ఆందోళిత మొహాలు స్పష్టంగా బహిర్గతమొనర్చాయి.

మిగిలిన నా దుర్భర జీవితాన్ని గురించి విని మీరు భరించలేరు. అదంతా కృష్ణ పక్షజీవితమే!

లోకంలో సర్వంవున్నవాడే సర్వోత్తముడు! సర్వసుఖాలు వాడికి సర్వేశ్వరుడు–అసలంటూ వుంటే– ప్రసాదించినట్టే! ఏలోటుతో జన్మించినా మానవుని జీవితం అవమానకరంగానే మారుతుంది.

నాకు మీ సహాయం, సానుభూతి అక్కరలేదు. వాటి అక్కర ఏనాడో తీరిపోయింది. నా బాధాభూయిష్టగాథ మీకు వినిపించి మీకు బాధకలిగించడం నాకిష్టంలేదు.

అందుకే విసుక్కోకండి కథ త్వరలోనే ముగిస్తున్నాను, నా జీవితాన్ని. కాని, నా కథ ముగిసేలోపల, నా జీవితపు కవాటాలు మూసుకొనేలోపల ప్రాపంచిక వదనాన్నుండి మాయం చేయాలనుందొకదాన్ని– అదే అవహేళన.

ఒకణ్ణి తన్నండి; హింసించండి; తిండిపెట్టకండి; చంపండి; అన్నీ ఫరవాలేదు భరిస్తాడు. కాని అవహేళనమాత్రం చెయ్యవద్దు. లోకంలో అవహేళనకంటె గొప్పశిక్ష లేదు. అదిసామాన్య మానవులకే కఠినశిక్ష; అలాంటిది వికలాంగులకు యమశిక్ష.

మానవత్వాన్ని ప్రదర్శించి, మన లోకాన్ని మహితాన్వితంచేసి, మనం కలకాలం మానవులంగామనడానికి తగిన ఆస్కారం కలిగించే సంస్కారం పొందమని నా మనవి. నా మనవిని విని మీమనస్సుల్లోని మమతల్నీ, దుర్మతల్నీ వొదలాలని నా అభిమతం.

చెవులుండి వినలేని చెవిటివాడూ, నోరుండి మాట్లాడలేని మూగవాడూ అయిన దేవుడ్ని కనుగొన్న మానవజాతికి చెందిన చెవిటివాణ్ణి అయిన నేను మానవగాథలకు చేర్చే మా (వికలాంగుల) నవగాథ ఇది! నా ఆత్మకథ!

*20. 02. 1956–ఆనందవాణి వారపత్రిక*